క్లుప్తంగా

గురుకుల పాఠశాల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్: కడప రామాంజనేయపురంలోని ఆంధ్ర ప్రదేశ్ గురుకుల పాఠశాల(మైనారిటీ బాలురు)లో మిగిలిన సీట్లకు మైనార్టీ విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తున్నట్లు ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ రామచంద్ర తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు 5, 6, 7వ తరతులలో మిగిలిన సీట్లకు ఎలాంటి రాత పరీక్ష లేకుండా నేరుగా అడ్మిషన్ పొందవచ్చని ఆయన తెలిపారు. తగిన ధ్రువపత్రాలతో పాఠశాలను సందర్శించి అడ్మిషన్ పొందవచ్చని తెలిపారు.

బాలసాహిత్యంపై సదస్సు

కడప ఎడ్యుకేషన్: వైవీయూ ఆధ్వర్యంలోని సిపిబ్రౌన్ భాషా పరిశోధనా కేంద్రంలో ఈ నెల 27న సదస్సు నిర్వహిస్తున్నట్లు బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి పేర్కొన్నారు. ఈ సదస్సులో ×ఆర్.సి.కృష్ణస్వామి రాజు బాలసాహిత్యం అంశంపై విశ్రాంత తెలుగు అధ్యాపకులు డాక్టర్ నెమిలేటి కిట్టన్న (తిరుపతి) ప్రసంగిస్తారని పేర్కొన్నారు. సాహితీ అభిమానులు హాజరుకావాలని ఆమె కోరారు.

శిల్పారామంలో సందడి



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కడప సెవెన్‌రోడ్స్: ఆదివారం ఆట విడుపు కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక వేదికపై కడప శిల్పారామంలో చిన్నారులు ఆదివారం సందడి చేశారు. స్థానిక ముద్ర డ్యాన్స్ అకాడమీ బృందం పలు జానపద, శాస్త్రీయ గీతాలకు అనుగుణంగా నృత్యాలు చేశారు. గోదారి గట్టు మీద, రాను రాను బొంబాయికి గీతాలకు చిన్నారుల నృత్యం విశేషంగా ఆకట్టుకుంది. శిల్పారామం పాలనాధికారి కృష్ణ ప్రసాద్, ఫీల్డ్ సూపర్‌వైజర్ మధుసూదన్‌బాబులు పర్యవేక్షించారు.

పది పరీక్ష పత్రాల మూల్యాంకనం నిధులను చెల్లించాలి



మాట్లాడుతున్న ఆవుల శ్రీనివాసులు

కడప ఎడ్యుకేషన్: పదో తరగతి పరీక్ష పత్రాల మూల్యాంకనం చేసిన ఉపాధ్యాయులకు భత్యం నిధులను వెంటనే జమ చేయాలని ఎస్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆవుల శ్రీనివాసులు డిమాండ్ చేశారు. కడప ఎస్‌టీఎఫ్ కార్యాలయంలో జరిగిన జిల్లా నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2025 పది పరీక్షలకు చీఫ్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్, స్క్వాడ్ రెమ్యూనరేషన్ ఇంతవరకూ విడుదల చేయలేదన్నారు. బదిలీలలో భాగంగా రీ అపోస్‌మెంట్‌లో వచ్చిన ఉపాధ్యాయులకు పొజిషన్ ఐడీలు కేటాయించి జీతాలు చెల్లించాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుపాకుల మురళి, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శులు బాలకృష్ణ, రవిశంకర్, తదితరులు పాల్గొన్నారు.

రూ.20 కోట్ల బ్రిడ్జి పనులకు షార్ట్ టెండర్లా..?

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : ప్రభుత్వ నిబంధనల ప్రకారం రూ.10 కోట్లకు పైబడి టెండర్లకు నాలుగు రోజుల గడువుతో ఓపెన్ టెండర్ పిలిచే ప్రక్రియను ప్రక్కనపెట్టారని సీపీఐ నగర కార్యదర్శి వెంకట శివ అన్నారు. సీపీఐ కార్యాలయంలో విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడుతూ ఏకపక్షంగా కాంట్రాక్టర్‌కు టెండర్ కట్టబట్టేందుకు షార్ట్ టెండర్‌ను ప్రకటించడం దారుణమన్నారు. నగర స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ పేరుతో ప్రభుత్వం కడప అభివృద్ధి పనులకు తొలిసారి రూ.20 కోట్లు విడుదల చేస్తే టెండర్ల దశలోనే జవాబుదారీతనం లోపించడం దారుణమన్నారు. 20న టెండర్‌పై పత్రికల్లో ప్రకటన వస్తే 19న సాయంత్రం 5 గంటలకు టెండర్ డౌన్లోడ్ ప్రారంభించి జూలై 21న సాయంత్రం 5.30గంటల వరకు సమయంతో షార్ట్ టెండర్ ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజాధనాన్ని పారదర్శకంగా వినియోగించాల్సిన బాధ్యత విస్మరించి మున్సిపల్ కార్పొరేషన్ యంత్రాంగం తొందరపాటు చర్యలు చేపట్టడం అక్రమాలకు తావు ఇవ్వడమేనన్నారు. టెండర్ల ప్రక్రియలో నిజమైన పోటీ లేకుండా ప్రజాధనాన్ని ఒకే వ్యక్తి చేతికి కట్టబట్టే షార్ట్ టెండర్ ప్రక్రియను పెద్ద మొత్తాల పనుల కోసం వినియోగించడం సమంజసం కాదన్నారు. షార్ట్ టెండర్ రద్దుచేసి ఓపెన్ టెండర్‌ను పిలవాలని సీపీఐ తరుపున డిమాండ్ చేస్తున్నామన్నారు.

చాముండేశ్వరిదేవికి పూజలు



చాముండేశ్వరి

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక వైఎంఆర్ కాలనీలోని చాముండేశ్వరీ దేవి అమ్మ వారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున అమ్మవారికి పంచామృతాభిషేకం, అవభృత స్నానం, కుంకుమార్చన చేసి అలంకరించారు. అమ్మవారికి నవహారతులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ప్రకృతి నీడలో.. పాలకొండరాయ క్షేత్రం

నగర శివారులో ప్రకృతి అందాలతో మానవ హృదయాలను పులకరింపజేసే కొండ కోనలు, సెలయేర్లు కలిగిన పుణ్యక్షేత్రం పాలకొండ రాయ స్వామి పుణ్యక్షేత్రం. కోరిక కోర్కెలు తీర్చే ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న పాలకొండరాయస్వామి దేవస్థానం ప్రస్తుత తిరుమలకు వైకుంఠ ద్వారం(ఉత్తర ద్వార దర్శనముగా పురాణ ప్రసిద్ధి. ఈ స్వామిని దర్శించుకుంటే కోరిన కోరికలు తీరుతాయని భక్తుల నమ్మకం.

- కోర్కెలు తీర్చే పాలకొండరాయ స్వామి
- ప్రచ్ఛదనాన్ని పులకరిస్తున్న పుణ్యక్షేత్రం
- శ్రావణ మాస ఉత్సవాలకు ముస్తాబైన ఆలయం



పాలకొండరాయస్వామి ఆలయ ముఖద్వారం



పాలకొండరాయ స్వామి, లక్ష్మీదేవి అమ్మవారు



పచ్చని చెట్ల మధ్య ఆలయం

కడప వైఎస్ఆర్ సర్కిల్: కడప జిల్లా కేంద్రం సమీపంలో పచ్చని కొండల, ప్రకృతి సోయగాల మధ్య గల పాలకొండలో కనువిందు చేసే జలపాతాలున్నాయి. కొండపై నుంచి వచ్చే నీరు స్వామి దగ్గరికి రెండు జలపాతాలుగా వచ్చి చివరికి అన్ని జలపాతాలు ఒకే చోటికి చేరుకుంటాయి. ఈ ఆలయంలో ఉన్న పాలకొండరాయ స్వామి, లక్ష్మీదేవిని దర్శించుకుంటే సంతానం లేని వారికి సంతానం కలుగుతుందని భక్తుల విశ్వాసం. ఆలయ ఆవరణంలో ఉన్న నాగుల పుట్ట ఎన్నో సంవత్సరాలుగా ఉంది. ఈ పుట్టకు నేటికీ పూజలు చేస్తున్నారు. పాలకొండరాయ స్వామికి ప్రతి ఏటా శ్రావణ మాసంలో కళ్యాణంతోపాటు వివిధ రకాల పూజలు నిర్వహిస్తుంటారు. ప్రతి శనివారం దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఉండేందుకు వసతి గృహాలు, మరుగుదొడ్లు ఏర్పాటుచేశారు. నేటికీ ఆలయ ఆవరణం నిండు చల్లదనంతో ఆహ్లాదంగా ఉంటుంది.

శ్రావణ మాసంలో ప్రతి వారం పూజలు

- ఈ నెల 28, ఆగస్టు 2 శనివారం కావడంతో పాలకొండరాయ స్వామి, లక్ష్మీదేవి పంచామృతాభిషేకం, ప్రత్యేక అలంకరణ చేస్తారు.
- ఆగస్టు9న శ్రావణ శనివారం సందర్భంగా పాలకొండరాయ స్వామి, లక్ష్మీదేవిలకు పంచామృతాభిషేకం, ప్రత్యేక అలంకరణ, ఉదయం 11 గంటల నుంచి స్వామి అమ్మవార్లకు ముత్యాల తలంబ్రాలతో కళ్యాణం నిర్వహిస్తారు.
- ఆగస్టు 16న శ్రావణ శనివారం సందర్భంగా పాలకొండరాయ స్వామి, లక్ష్మీదేవిలకు పంచామృతాభిషేకం, ప్రత్యేక అలంకరణ రమియు సుదర్శన హోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ శ్రావణ మాసం నాలుగు వారాలు లయ ప్రాంగణంలో అన్నదానం నిర్వహిస్తారు.

ఏటా శ్రావణ మాసోత్సవాలు



ఏటా శ్రావణమాసంలో పాల కొండరాయ స్వామికి జరిగే మాసోత్సవాల్లో భక్తులు పాల్గొన్ని జయప్రదం చేయాలి. నాలుగు వారాలపాటు జరిగే ఈ ఉత్సవాల్లో స్వామికి ప్రత్యేక అభిషేకాలు, అన్నదాన కార్యక్రమం ఉంటుంది. ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తగిన ఏర్పాట్లు చేశాం.

– కె.శ్రీనివాసులు, ఆలయ కార్యనిర్వాహణాధికారి, పాలకొండ దేవస్థానం, కడప

పెండింగ్ నిధులను వెంటనే చెల్లించాలి



మాట్లాడుతున్న గుత్తి గంగరాజు

కడప ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్ నిధులను వెంటనే చెల్లించాలని బహుజన టీచర్స్ యూనియన్(బిటియూఏపీ) జిల్లా అధ్యక్షుడు మేండ్రి గుత్తిగంగరాజు కోరారు. కడప బీటీయూఏపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటై 13 నెలలైనా ఇంతవరకు పీఆర్‌సీ కమిటీ వేయకపోవడం దారుణం అన్నారు. తాము అధికారంలోకి రాగానే ఆర్ఐ ప్రకటిస్తామని, మెరుగైన పీఆర్‌సీ ఇస్తామని ఇచర్చిన హామీ నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు మేకల శివార్జున, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుదర్శన్ బాబు, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు కట్టా గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.


గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



బోనాలు తీసుకెళ్తుతున్న భక్తులు

చింతకొమ్మదిన్నె : కొత్తపేట గంగమ్మ తల్లి దర్శనానికి ఆదివారం భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చారు. ఆదివారం ఆలయంలో అమ్మవారికి పట్టు వస్త్రాలు, నగలు, గంధం, పసుపు, వేపాకు, ప్రత్యేక పూలమాలలతో విశేష అలంకరణ చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి మొక్కుబడులను, ముడుపులను అమ్మవారికి చెల్లించుకున్నారు. మహిళా భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. అలాగే గంగమ్మ ఆలయ సమీపంలోని వీరభద్రస్వామి, శివాలయం, ఆంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు.

పెండ్లిమర్రి: మండలంలోని పగడాలపల్లె, ద్వారకానగర్ గ్రామాలకు చెందిన భక్తులు వర్షం కురవాలని ఆదివారం గంగమ్మకు బోనాలు సమర్పించారు. మహిళలు పెద్ద ఎత్తున బోనాలతో అమ్మవారికి భక్తి ప్రపత్తులతో మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు కురిసి, పంటలు సమృద్ధిగా పండి రైతన్నలు సుఖసంతోషాలతో ఉండాలని గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



గంగమ్మతల్లి

పైపైకి కూరగాయల ధరలు



రైతు బజార్

కడప అగ్రికల్చర్: వర్షాభావ పరిస్థితుల కారణంగా జిల్లాలో కూరగాయల ధరలు పైపైకి పోతున్నాయి. మొన్నమొన్నటి వరకూ కిలో రూ.10 పలికిన టమాటా ధర ఒక్కసారిగా రూ.24కు పెరిగింది. కిలో రూ.24 ఉన్న పచ్చి మిర్చి ధర ఒక్కసారిగా రూ.60కి చేరింది. రోజు రోజుకూ ధరలు పెరుగుతుండడంతో సామాన్యులు, పేదలు బెంబేలెత్తిపోతున్నారు. వందల రూపాయలు ఖర్చుచేసిన ఓ చిన్న కుటుంబానికి నాలుగైదు రోజులు సరిపడా కూరగాయలు రావడం లేదు. మరో వైపు నిత్యావసర వస్తువులు ధర చేతి కందేంత పరిస్థితి లేకపోవడంతో పేదలు పచ్చడి మెతుకులు తినేందుకు జంకుతున్నారు. ప్రతి వంటకు అవసరమైన పచ్చి మిర్చి, టమాటా ధరలు కొండెక్కాయి. వీటితోపాటు బీన్స్ కిలో రూ.75, అల్లం కిలో రూ.75, క్యారెట్ కిలో రూ.60, క్యాప్సికం కిలో రూ.60, అనపకాయ కిలో రూ.55 చిక్కుడకాయ కిలో.50, మునగకాయ కిలో రూ.50, కాకరకాయ, అలసందకాయలు, కాలీఫ్లవర్, బీట్‌రూట్, దొండకాయలు కిలో.40, బీరకాయ, ముల్లంగి, దోసకాయ, బంగాళదుంప, మట్టికాయలు కిలో రూ.35, క్యాబేజీ కిలో రూ.25కు చేరింది. వీటికి తోడు ఆకు కూరల ధరలు అమాంతం పెరిగిపోవడంతో సామాన్యులు విలవిలలాడిపోతున్నారు, వర్షాలు లేకపోవడం, విపరీతమైన గాలులు వీయడంతో కూరగాయల దిగుబడులు ఆశించినంద రావడం లేదని రైతులు తెలిపారు. దూరప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి రావడంతో ధరలు పెరిగిపోయాయని వ్యాపారులు చెబుతున్నారు. నెల రోజుల పాటు ఇది కొనసాగే అవకాశముందని వ్యాపారులు తెలిపారు.

కూరగాయల రకం	ధర రూపాయల్లో
బీన్స్	75
అల్లం	75
క్యాప్సికం	60
మిరపకాయ	60
క్యారెట్	60
బజ్జిమిర్చి	55
ఆనపకాయ	55
చిక్కుడుకాయ	50
చిక్కుడుకాయ	50
మునక్కాయలు	50



రూ. 60కు చేరిన మిరప

కక్ష సాధింపు రాజకీయాలు

ప్రొద్దుటూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కక్ష సాధింపు రాజకీయాలు తారస్థాయికి చేరాయని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు సీఎం.దావూద్ అన్నారు. విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడుతూ ఉద్యోగులను బెదిరించి, బ్లాక్‌మెయిల్ చేసి స్టేట్‌మెంట్లు తీసుకుని మద్యం అక్రమ కేసులో ఎంపీ మిథున్ రెడ్డిని ఇరికించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. చంద్రబాబు రాజకీయ జీవితమంతా కుట్రలతో సాగుతోందని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తుండటంతోనే వైఎస్సార్‌సీపీ కీలక నేతలపై కేసులను పెట్టి అరెస్టు చేస్తున్నారని మండిపడ్డారు. 2014–19లో చంద్రబాబు, ఆయన ప్రభుత్వంలోని మంత్రులు, సన్నిహితులపై దాదాపు 13 అవినీతి కేసులున్నాయని, అందులో మద్యం కుంభ కోణం కేసు కీలకమైందన్నారు. 2014–19 మధ్య లిక్కర్ స్కాంలో చంద్రబాబు అడ్డంగా దొరికిపోయారని, అలాంటి చంద్రబాబు ఇప్పుడు అధికారంలోకి రాగానే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కీలకంగా పనిచేసిన వారిపై కక్ష సాధింపుతో ఎదురు కేసులు పెట్టిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ఒక్క బెల్ట్ షాపు లేదని, ప్రభుత్వమే పారదర్శకంగా మద్యం దుకాణాలు నిర్వహించిందన్నారు. కానీ నేడు గ్రామాల్లో ప్రజా ప్రతినిధులు విచ్చలవిడిగా మద్యం మాఫియాను ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు.

ప్రతి ఇంటి నుంచి మానవతా సభ్యత్వం



మాట్లాడుతున్న సాంబశివారెడ్డి

కడప సెవెన్‌రోడ్స్: ప్రతి ఇంటి నుంచి మానవత సంస్థకు సభ్యత్వం ఉండాలని నగర అధ్యక్షుడు సాంబశివారెడ్డి తెలిపారు. మానవతా నగర కమిటీ నెలవారీ సమీక్ష సమావేశం ఆదివారం స్థానిక నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. సాంబశివారెడ్డి మాట్లాడుతూ జూన్, జులై, ఆగస్టు నెలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టామన్నారు. సెంట్రల్ కమిటీ డైరెక్టర్ రాటాల గోపి మాట్లాడుతూ రూ.600 సభ్యత్వంతో సమాజానికి ఎంతో సేవ చేస్తున్నామన్నారు. పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలకు తాము ఉపయోగ పడటం మనకు ఎంతో గర్వకారణమన్నారు. వ్యవసాయ శాఖ ఏడీ అంబవరం ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ సమావేశానికి తన వంతు సేవగా మానవతకు పిలుస్తూనే వచ్చానని చెప్పారు. ఆధ్యాత్మికత ద్వారా సద్గుణాలు అలవడతాయని పేర్కొన్నారు. ఆత్మీయ సహకార కమిటీ ఛైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ దుఃఖంలో ఉన్న వారిని ఓదార్చడమే మానవతా లక్ష్యమన్నారు. పీఆర్‌టీ పప్పనపోయిన సుబ్బరాయుడు మాట్లాడుతూ ఇప్పటికే అనేక సేవా కార్యక్రమాలు ప్రజల్లోకి వెళ్లాయని, మానవత సంస్థను ప్రతి ఒక్కరూ ఆదరిస్తున్నారన్నారు. ఉపాధ్యాయురాలు బన్నూరు రాజేశ్వరమ్మ శాంతిరథానికి రూ.6 లక్షలు, సంస్థకు మరో రూ.20 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల వ్యవస్థాపకులు బైరెడ్డి రామకృష్ణారెడ్డి, ఇంకా మానవత సంస్థ ప్రతినిధులు భూపతి రాయల్, బాల ఎల్లారెడ్డి, సుబ్బారెడ్డి వెంకట్రామిరెడ్డి, చంద్రమోహన్ రెడ్డి, అవ్వారు సుబ్బయ్య, కృష్ణారెడ్డి, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు నాసిరకం కందిపప్పు



మాట్లాడుతున్న కేసీ.బాదుల్లా

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఐసీడీఎస్ అధికారులు కాంట్రాక్టర్లతో కుమ్మక్కు కావడంతోనే అంగన్‌వాడీ కేంద్రాలకు నాసిరకం కందిపప్పు అందుతోందని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కేసీ.బాదుల్లా అన్నారు. నగరంలోని హోచిమిన్ భవన్‌లో విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడుతూ బద్వేల్ తదితర ప్రాంతాల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు పిల్లలు, గర్భిణులు, బాలింతలకు అందజేస్తున్న కందిపప్పు బూజు పట్టిందన్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్తే ప్రభుత్వం ఇచ్చిన పప్పు అందజేశామని బుకాయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్వాడీల్లో ముందుగానే వేలిముద్ర వేయించుకుని రెండు, మూడు రోజుల తర్వాత సరకులు సరఫరా చేస్తుండడంతో గుర్తించలేకపోతున్నారన్నారు. కలెక్టర్ స్పందించి ఆయా కేంద్రాలకు అందించే సరకుల్లో నాణ్యత ఉండేలా చూడాలన్నారు. సరకులు నాణ్యమైన లేకపోవడంతో లబ్ధిదారులకు సమాధానాలు చెప్పుకోలేక కార్యకర్తలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సుబ్బరాయుడు పాల్గొన్నారు.

వైభవంగా ఆడికృత్తిక మహోత్సవం



కావడి పూజ చేస్తున్న భక్తులు

కమలాపురం: మండలంలోని రామాపురంలో వెలసిన మహాలక్ష్మీ సమేత మోక్ష నారాయణ స్వామి ఆలయంలో కొలువైన వల్లి దేవసేన సుబ్రహ్మణ్య స్వామికి ఆదివారం ఆడికృత్తిక మహోత్సవం వైభవంగా నిర్వహించారు. వల్లి దేవసేన, సుబ్రహ్మణ్య స్వామికి నిత్య కల్యాణం నిర్వహించడం ఈ ఆలయ విశిష్టత. అందువల్ల జిల్లా నుంచే కాక ఇతర ప్రాంతాల నుంచి సైతం భక్తులు ఆలయానికి తరలి వచ్చారు. స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఈ ఆలయంలో సుబ్రహ్మణ్య స్వామి షణ్ముఖుడిగా రెండు కంఠాలు కలసి ఉండి ద్వికంధురుడిగా వెలసి ఉండటంతో ఈ రోజు స్వామి వారిని పూజించడం కోసం భక్తులు తరలివచ్చారు. కాగా ఉదయం నాగబంధ హోమం, కాలసర్ప దోష నివృత్తి హోమం, సుబ్రహ్మణ్య స్వామి హోమంతో పాటు అనేక రకాల పూజలు, శత అష్టోత్తర కలశాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించారు. ఉదయం మాడ వీధులలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి కావడి ఉత్సవం ఆలయ ప్రధాన సేవకుడు సాయినాథ శర్మ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అలాగే మయూర వాహనంపై వల్లి దేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారు ఊరేగింపు నిర్వహించారు. భక్తులకు నిర్వాహకులు అన్ని రకాల ఏర్పాట్లు చేయడంతో పాటు అన్న తీర్థ ప్రసాదాలు ఏర్పాటు చేశారు. ఆలయ అర్చక స్వాములు జగదీష్ శర్మ, మారుతీ శర్మల ఆచారత్వమున పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు.

బాబు హామీలను ఎండగడుదాం

- ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వ వైఫల్యాలను చెబుదాం
- ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ పిలుపు



క్యూర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ

కాశినాయన : ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు ప్రజలకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా నెరవేర్చకపోవడంతో అన్ని వర్గాల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని, దీనిని దృష్టిలో ఉంచుకుని హామీలతో ఎంతగా ప్రజలను వంచించారో ప్రజల్లో ఎండగట్టాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని నరసాపురం బీఎన్‌రెడ్డి స్కూల్ ఆవరణలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. బాబు హామీలు, మోసాలపై క్యూఆర్ కోడ్‌ను పార్టీ నేతలతో కలసి ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి డి.ఆదిత్య రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి మాట్లాడుతూ అధికారమే పరమావధిగా ఎన్నికల్లో అడ్డగోలు హామీలు ఇచ్చి వాటిని నెరవేర్చకపోవడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని విమర్శించారు. తమ ప్రభుత్వ పాలనలో ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలు అందిస్తే వాటిని చంద్రబాబు నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. నిరుద్యోగ భృతి పేరిట యువతను, ఉచిత బస్సు ప్రయాణం పేరుతో మహిళలను, పెట్టుబడి సాయం పేరుతో రైతులను దగా చేశారని దుయ్యబట్టారు. బాబు చేసిన ఈ వంచన, దగా, మోసాన్ని ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు.

భయపడే ప్రసక్తే లేదు

కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించినా, నిలదీసినా అక్రమ కేసులు బనాయించడమే పనిగా పెట్టుకున్నారని, దీనికి భయపడే ప్రసక్తే లేదని ఎమ్మెల్సీ గోవిందరెడ్డి స్పష్టం చేశారు. బద్వేలు నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై తప్పుడు కేసులు పెడుతున్నారని అన్నారు. ఇలాంటి సంస్కృతి నియోజకవర్గంలో ఎప్పుడూ లేదన్నారు. దివంగత మాజీ మంత్రి బిజివేముల వీరారెడ్డి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని, ఆయన మనువడు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రితేష్‌రెడ్డి నేడు కమీషన్లకు కక్కుర్తి పడి రూ.లక్షలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.40కోట్లతో లిఫ్ట్ ఇరిగేషన్ పనులు మంజూరు చేయించామని, అందులో భాగంగా మొదట తెలుగు గంగ కాలువ నుంచి వరికుంట్ల చెరువుకు రూ.10కోట్లతో పైపులైన్ నిర్మించామన్నారు. రూ.4–5 కోట్లు ఖర్చు పెడితే వరికుంట్ల చెరువుకు నీరు అందుతుందన్నారు. టీడీపీ నాయకులు ఇటువంటివాటిపై దృష్టి సారించకుండా కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు.

అబద్ధపు హామీలు

ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికలకు ముందు అబద్ధపు హామీలు ఇచ్చి గెలిచి అధికారంలోకి వచ్చారని ఎమ్మెల్యే డాక్టర్ సుధ విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయక ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై, నాయకులపై తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారన్నారు. ఎవరు భయపడకుండా పార్టీ కోసం పని చేయాలని అండగా ఉంటామని ఆమె భరోసా ఇచ్చారు. అనంతరం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి దేవసాని ఆదిత్యరెడ్డి మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇంటి వద్దకే పథకాలు అందేవని, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో అబద్ధాలు చెప్పడం తప్ప పథకాలు అమలు చేసిన దాఖలాలు లేవని విమర్శించారు. కూటమి నాయకుల బెదిరింపులకు బెదిరే ప్రసక్తే లేదన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ హనుమంతురెడ్డి, కరెంట్ రమణారెడ్డి, పంగా గురివిరెడ్డి, గొంటువారిపల్లె రమణారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నాగసుబ్బారెడ్డి, రాజశేఖరరెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, రాజుగాళ్ల వెంకటరెడ్డి, రమణారెడ్డి, నరసింహారెడ్డి, సర్పంచ్ వెంకటరామిరెడ్డి, ఓబుళరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

● ప్రచారం అమోఘం... ఫలితం శూన్యం!





రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర పేరిట ప్రచారం చేస్తున్నా.. ఆచరణలో విఫలం అవుతోంది. కూటమి ప్రభుత్వం చెప్పేదొకటి.. చేసేదొకటి అన్నట్లు చెత్త సేకరణ పడకేసింది. రూ.10 పన్ను ఎత్తేసిన తర్వాత మున్సిపాల్టీ, నగర పాలక సంస్థలు చెత్త తొలగింపులో నిర్లక్ష్యం చేస్తున్నారు. కడప ఏడో డివిజన్‌లోని శంకరాపురం వద్ద కాల్వలో గత నెలరోజులుగా చెత్త తీయకపోవడంతో ఇలా కనిపిస్తోంది. ప్లాస్టిక్ బాటిల్స్, మురుగు కలిసి దుర్గంధం వెదజల్లుతోంది. ఆ దారిన వెళ్లాలంటే ముక్కు మూసి నడవాల్సిందే మరి.

– సాక్షి ఫోటో గ్రాఫర్, కడప

బురద దారుల్లో.. అడుగు వేయలేక



దారి పొడవునా గోతుల్లో నిలిచిన వర్షపునీరు

చింతకొమ్మదిన్నె : కూటమి ప్రభుత్వం రహదారులను గురించి పట్టించుకోలేదు. గ్రామాల్లో సైడు కాలువల ఊసే లేకుండా పోయింది. దీంతో పల్లెముంగిళ్లలో బురదదారులు వెక్కిరిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు మరీ అధ్వానంగా తయారయ్యాయి. అడుగుతీసి అడుగువేయలేని పరిస్థితి నెలకొంది. మండలంలోని ఇప్పపెంట పంచాయతీ బోడేద్దులపల్లె గ్రామంలోని మీదుగా వెళ్లే కడప ఎర్రముక్కపల్లె – పవర్ గ్రిడ్ ప్రధాన రహదారి మోకాళ్ల లోతు గుంతలు, నీళ్లతో బురదమయంగా మారింది. ఈ రహదారిపై కడప నగరంలోని ఎర్రముక్కపల్లె నుంచి రాయచోటి హైవే పైకి పవర్ గ్రిడ్ వద్ద నేరుగా కలుస్తుంది. నిత్యం వందలాది వాహనాలు ఈ రహదారిపై గుంతల్లో నుంచే ప్రయాణిస్తుంటాయి. స్థానిక అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. మురుగు నీరు నిలువడంతో దోమలు విజృంభిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. రోడ్డుకు మరమ్మతులు చేసి ఇబ్బందులు లేకుండా చేయాలని ప్రజలు కోరుతున్నారు.